క్లుప్తంగా

ఏచూరి లేని లోటు పూడ్చలేనిది



సీతారాం ఏచూరి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న సీపీఎం నేతలు

బుచ్చిరెడ్డిపాళెం రూరల్ : సీపీఎంలో సీతారాం ఏచూరి లేని లోటును ఎవరూ పూడ్చలేరని ఆ పార్టీ నేతలు అన్నారు. పట్టణంలోని సీపీఎం కార్యాలయంలో సీతారాం చిత్రపటం వద్ద శుక్రవారం నివాళి అర్పించారు. ఈ సందర్భంగా సీపీఎం మండలాధ్యక్షుడు పి.మల్లికార్జున మాట్లాడారు. విద్యార్థి దశ నుంచే సీపీఎం కార్యక్రమాల్లో ఏచూరి చురుగ్గా పాల్గొనే వారని, మూడుసార్లు జాతీయ కార్యదర్శిగా ఎన్నికై అనేక పోరాటాలకు నాంది పలికారని కొనియాడారు. కార్యక్రమంలో కామ్రేడ్ జానకిరామయ్య, సీఐటీయూ మండల కార్యదర్శి మల్లికార్జున, నన్నం మాధవయ్య తదితరులు పాల్గొన్నారు.

వీఎస్‌యూ వీసీని కలిసిన అధికారులు



వెంకటాచలం: విక్రమ సింహపురి యూనివర్సిటీ (వీఎస్‌యూ) ఇన్‌చార్జి వీసీ విజయభాస్కరరావును డైరెక్టర్ ఆఫ్ ఎక్స్‌టెర్నల్ ఎంగేజ్‌మెంట్ డాక్టర్ కేవీ స్వామి శుక్రవారం కాకుటూరులోని వర్సిటీలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా విశ్వవిద్యాలయ అకడమిక్ కార్యక్రమాలు, పరిశోధనా విధానాలు, నైపుణ్యాలపై విస్తృతంగా చర్చించారు.

వరద బాధితులకు ఆర్థిక సాయం



మనుబోలు: మండలంలోని పిడూరుపాళెం గ్రామంలో ఉన్న ఉజ్వల ఇంగ్లిష్ మీడియం పాఠశాల చిన్నారులు విజయవాడ వరద బాధితుల కోసం తమ వంతు ఆర్థిక సాయం అందించారు. పిల్లలు విరాళంగా అందించిన రూ.11 వేల నగదును శుక్రవారం కలెక్టర్ ద్వారా ప్రభుత్వానికి పంపించినట్లు స్కూల్ కరస్పాండెంట్ వాసిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, ప్రిన్సిపల్ చైతన్య తెలిపారు.

వాల్‌పోస్టర్ల ఆవిష్కరణ



ఇందుకూరుపేట: నులిపురుగుల నివారణ దినోత్సవానికి సంబంధించిన వాల్‌పోస్టర్లను శుక్రవారం మండలంలోని జగదేవిపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మెడికల్ ఆఫీసర్స్ డాక్టర్ కిశోర్ కుమార్, డాక్టర్ బ్రహ్మేశ్వర నాయుడు మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాలు, ప్రభుత్వ, ప్రైవేట్ స్కూల్స్‌లో పిల్లల చేత ఆల్బెండజోల్ మాత్రలను మింగించాలన్నారు. కార్యక్రమంలో హెల్త్ ఎడ్యుకేటర్ సుధాకర్‌రావు హెల్త్ సూపర్‌వైజర్లు రమ, సతీష్‌బాబు, 104 వైద్య సిబ్బంది లక్ష్మణ్ సుల్తాన్‌బాషా తదితరులు పాల్గొన్నారు.

యల్లాయపాళేనికి ఆర్టీసీ సర్వీసు

కొడవలూరు : మండలంలోని యల్లాయపాళేనికి ఆర్టీసీ బస్సు సర్వీసును ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామస్తుల ఆకాంక్ష మేరకు నెల్లూరు నుంచి యల్లాయపాళేనికి బస్సును ఏర్పాటు చేశామని, సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఆర్టీసీ డీఎం మురళీకృష్ణ, నాయకులు ఎం.శ్రీహరిరెడ్డి, కేతు వెంకటరమణారెడ్డి, జి.రాజేంద్ర, బి.విజయకుమార్, బి.శ్రీనివాసులు, బి.విశ్వనాథ్, ఎం.ప్రవీణ్‌కుమార్‌రెడ్డి, కె.అమరేంద్రరెడ్డి, కె.మల్లికార్జున పాల్గొన్నారు.

18న తిరుమలకు పాదయాత్ర

పొదలకూరు: ఈనెల 18వ తేదీన పట్టణంలోని శ్రీలక్ష్మి వెంకటేశ్వరస్వామి దేవస్థానం ఆధ్వర్యంలో తిరుమలకు పాదయాత్ర చేపట్టడం జరుగుతుందని నిర్వాహకులు శుక్రవారం తెలిపారు. ఉదయం 6 గంటలకు పాదయాత్ర ప్రారంభమవుతుందన్నారు. ఆసక్తి కలిగిన భక్తులు ముందుగా తమ పేర్లను నమోదు చేసుకోవాలని సూచించారు.

అమాత్యా.. ఆలకించయ్యా

కామాక్షమ్మ సాక్షిగా తమ్ముళ్ల కబ్జా పర్వం

- కబ్జా కోరల్లో ఆలయ భూములు
- చక్రం తిప్పుతున్న టీడీపీ నాయకులు
- ఆలయ ఆదాయానికి భారీ గండి
- పట్టించుకోని ప్రజాప్రతినిధులు, అధికారులు



మల్లికార్జున సమేత కామాక్షితాయి ఆలయం

బుచ్చిరెడ్డిపాళెం రూరల్: ప్రముఖ పుణ్యక్షేత్రం జొన్నవాడలో కొలువైన మల్లికార్జున సమేత కామాక్షితాయి ఆలయ భూములు భారీ స్థాయిలో కబ్జారాయుళ్ల చేతుల్లో చిక్కుకుని ఉన్నాయి. ఆలయానికి సంబంధించి 1,200 ఎకరాలకు పైగా భూములు ఉన్నాయి. వీటికి సంబంధించి రికార్డులు పక్కాగా ఉన్నా.. క్షేత్రస్థాయిలో మాత్రం భూములను టీడీపీ నాయకులు ఆక్రమించి రూ.కోట్లకు పడగలెత్తారు. దేవాలయ ఆదాయానికి భారీగా గండికొడుతున్నారు. కామాక్షితాయి ఆలయ నడిబొడ్డున ఇటీవల రూ.5 కోట్ల విలువైన భూమిని కొందరు టీడీపీ నాయకుల అండతో జేసీబీతో చదును చేశారు. మీడియా ప్రమేయంతో విషయం బయటకు పొక్కడంతో ఆ ప్రయత్నాన్ని విరమించుకున్నారు. ఇలాంటి ఘటనలు నిత్యం జరుగుతున్నా ఆలయ ఈఓ కానీ, అధికారులు కానీ ఏమీ తెలియట్లు వ్యవహరిస్తున్నారు. అధికారుల ఉదాసీనత కబ్జారాయుళ్ల పాలిట వరంగా మారింది.

దర్జాగా అనుభవిస్తూ..

కామాక్షితాయి ఆలయ భూములు జిల్లా వ్యాప్తంగా వివిధ ప్రాంతాల్లో ఉన్నాయి. ఎక్కువగా ఆలయానికి సమీపంలోని జొన్నవాడ, పెనుబల్లి గ్రామాల్లో వందల ఎకరాలను ఏళ్ల తరబడి కబ్జారాయుళ్లు దర్జాగా అనుభవిస్తున్నారు. ఆలయానికి నిర్ణీత రుసుము చెల్లించాల్సి ఉన్నా అలాంటివేవీ చెల్లించరు. ఏటా రెండు మూడు పంటలు పండిస్తూ రూ.లక్షల్లో సంపాదిస్తున్నా ఈఓలు కనీస చర్యలు తీసుకున్న పాపాన పోలేదు. దీనికి కారణం ఈఓలకు ముడుపులు అందుతుండడంతో ఉలుకూ పలుకూ లేకుండా ఉన్నారు. లీజుల పేరిట రూ.కోట్లలో రావాల్సిన ఆదాయం రాకపోవడంతో ఆలయ ఆదాయానికి భారీగా నష్టం చేకూరుతోంది.

రెవెన్యూ అధికారుల లీలలు

కబ్జాకు గురైన అమ్మవారి భూములను కొందరు రెవెన్యూ అధికారులతో చేతులు కలిపి వారి పేరిట రిజిస్ట్రేషన్ చేయించుకున్నారని పలువురు భక్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గతంలో ఆలయ భూములకు సంబంధించి రెవెన్యూ రికార్డుల్లో పట్టాదారుడు, అనుభవదారుని కాలంలో మల్లికార్జున స్వామి కామాక్షితాయి దేవస్థానం అని ఉండేది. ప్రస్తుతం పలువురు అధికారులు కబ్జాదారుల నుంచి పెద్దమొత్తంలో నగదు తీసుకుని పట్టాదారుని కాలంలో మల్లికార్జునస్వామి కామాక్షితాయి దేవస్థానం అని ఉంచి, అనుభవదారుని కాలంలో కబ్జారాయుళ్ల పేర్లను చేర్చారు. కొందరు ఆలయ భూములకు సంబంధించిన సర్వేనంబర్లు మార్చి రిజిస్ట్రేషన్ చేయించి భూములు తమ సొంతవిగా భావిస్తున్నారు.

హైకోర్టు ఆదేశాలు బేఖాతర్

ఆలయ భూములు ఎవరి దగ్గర ఉన్నా వాటిని స్వాధీనం చేసుకోవాలని గతంలో హైకోర్టు తీర్పునిచ్చింది. చాకిరిమాన్యాల భూములైన కులవృత్తులవారు ఆలయంలో విధులు నిర్వర్తించకుంటే సదరు భూములను ఆలయ అధికారులు స్వాధీనం చేసుకోవాలని హైకోర్టు ఉత్తర్వుల్లో స్పష్టంగా పేర్కొంది. పరాధీనంలో ఉన్న ఆలయ భూములను రక్షించేందుకు హైకోర్టు రక్షణ కవచం లాంటి తీర్పునిచ్చినా క్షేత్రస్థాయిలో అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు.

ప్రజాప్రతినిధుల నిర్లిప్తత

జిల్లాకు చెందిన ఆనం రామనారాయణరెడ్డి ప్రస్తుతం దేవదాయ శాఖ మంత్రిగా వ్యవహరిస్తున్నారు. అమ్మవారి భక్తురాలిగా ప్రచారం చేసుకునే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి కోవూరు ఎమ్మెల్యేగా ఉన్నారు. రామనారాయణరెడ్డి రాష్ట్రంలో దేవదాయశాఖ పరిధిలో ఉన్న ఆలయ భూముల రక్షణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటామని గతంలో తెలిపారు. రాష్ట్రం సంగతి దేవుడెరుగు సొంత జిల్లాలో అనేక దేవాలయాలకు చెందిన వేల ఎకరాల భూములు ఏళ్ల నుంచి కొందరు దర్జాగా అనుభవిస్తున్నారు. అటువంటి వారిపై ఇప్పటి వరకు చర్యలు శూన్యం. కామాక్షితాయి ఆలయ భూముల కబ్జా వ్యవహారం కోవూరు ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డికి అన్నీ తెలిసినా తనకేమీ తెలియనట్లు వ్యవహరిస్తున్నారు. ఆలయ భూములను పరిరక్షించాలనే ఆలోచన ఆమెకు ఉంటే మంత్రి ఆనం దృష్టికి తీసుకెళ్లి భూములన్నీ రీసర్వే చేయడం ద్వారా సమస్యను పరిష్కరించేందుకు అవకాశం ఉంది. అయినా ఆ దిశగా అడుగులు పడటంలేదు. దీనికి కారణం భూములు కబ్జా చేసి అనుభవిస్తున్న వారంతా టీడీపీకి చెందిన వారు కావడంతో చర్యలకు వెనుకాడుతున్నట్లు సమాచారం.



ఆలయానికి సమీపంలోని భూమి ఆక్రమణకు చదును చేయించిన దృశ్యం (ఫైల్)

బ్లాక్‌చైన్ టెక్నాలజీపై శిక్షణ



కొడవలూరు : మండలంలోని నార్తురాజుపాళెం వద్ద ఉన్న శ్రీవెంకటేశ్వర ఇంజినీరింగ్ కళాశాలలో సీఎస్సీ, ఏఐడీఎస్ ఫైనలియర్ విద్యార్థులకు బ్లాక్‌చైన్ టెక్నాలజీపై శుక్రవారం శిక్షణ ఇచ్చారు. ఢిల్లీకి చెందిన స్టార్క్ నెట్ డెవలప్‌మెంట్ అడ్వొకేట్ మున్ని రిసోర్స్ పర్సన్‌గా వ్యవహరించారు. ఈ సందర్భంగా కళాశాల చైర్మన్ డాక్టర్ పి.గుణశేఖర్ మాట్లాడుతూ బ్లాక్‌చైన్ టెక్నాలజీలో ఉపాధి అవకాశాలు మెండుగా ఉన్నాయన్నారు. కార్యక్రమాన్ని ఆర్‌అండ్‌డీ డీన్ డాక్టర్ వెంకట నాగేంద్ర పర్యవేక్షించారు. ప్రిన్సిపల్ కె.ప్రకాష్ రావు, అధ్యాపక బృందం పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

కొడవలూరు: మండలంలోని అన్ని గ్రామాల్లో శనివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏఈ ఎం.రాములు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. కొత్తవంగల్లు, గండవరం, యల్లాయపాళెం, పద్మనాభసత్రం, రామన్నపాళెం సబ్‌స్టేషన్లలో శనివారం మరమ్మతులు చేస్తారని, వాటి పరిధిలోని గ్రామాల్లో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకూ విద్యుత్ సరఫరా నిలిపి వేస్తామన్నారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

ఎస్‌ఈఐఎల్ ప్రాజెక్ట్‌కు అవార్డు



అవార్డు అందుకుంటున్న ప్రాజెక్ట్ ప్రతినిధులు

ముత్తుకూరు: మండలంలోని నేలటూరులో ఉన్న ఎస్‌ఈఐఎల్ ఎనర్జీ ఇండియా లిమిటెడ్ ప్రాజెక్ట్‌ను ప్రతిష్టాత్మక అవార్డు వరించింది. భారత పరిశ్రమల సమాఖ్య నుంచి 'నేషనల్ అవార్డు ఫర్ ఎక్సలెన్స్ ఇన్ ఎనర్జీ మేనేజ్‌మెంట్–2024' అవార్డు వచ్చింది. ఎస్‌ఈఐఎల్ ప్రాజెక్ట్–1కి ఎక్సలెన్స్ ఎనర్జీ ఎఫిషియంట్ యూనిట్‌గా గుర్తింపు లభించింది. హైదరాబాద్‌లో శుక్రవారం జరిగిన కార్యక్రమంలో ప్రాజెక్ట్ ప్రతినిధులు ఆపరేషన్స్ హెడ్ నాగేశ్వరరావు, ఇంజినీరింగ్ డీజీఎం శ్రీరామచంద్రమూర్తి భువనగిరి, ఏజీఎం నారాయణ తదితరులు ఈ అవార్డును అందుకున్నారు. ఈ సందర్భంగా సీఈఓ రాఘవ్ త్రివేది మాట్లాడుతూ ఇంధన రంగంలో అగ్రగామిగా ఉంటూ ఇలాంటి అవార్డులు అందుకోవడం గర్వంగా ఉందన్నారు.

రూ.30 వేల విరాళం అందజేత



విరాళాన్ని అందజేస్తున్న ప్రిన్సిపల్ లక్ష్మీప్రసూన

కోవూరు : విజయవాడ వరద బాధితుల కోసం స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల నుంచి సేకరించిన రూ.30 వేల విరాళాన్ని విక్రమ సింహపురి యూనివర్సిటీ ఇన్‌చార్జి వీసీ విజయభాస్కర్‌కు శుక్రవారం అందజేశారు. ఈ మేరకు కళాశాల ప్రిన్సిపల్ లక్ష్మీప్రసూన, ఇతర అధ్యాపక సిబ్బంది వర్సిటీలో ఇన్‌చార్జి వీసీని కలిసి చెక్కును అందించారు. కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ రామ్‌ప్రసాద్, ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ మధుసూదన్, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

గ్రామాల్లో పారిశుద్ధ్య కార్యక్రమాలు



మనుబోలు : మాట్లాడుతున్న ఎంపీడీఓ వెంకటేశ్వర్లు

మనుబోలు: ఈనెల 17 నుంచి అక్టోబర్ 2వ తేదీ వరకు స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమాలను నిర్వహించాలని ఎంపీడీఓ వెంకటేశ్వర్లు పంచాయతీ కార్యదర్శులకు సూచించారు. శుక్రవారం ఆయన తన కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ స్వచ్ఛభారత్ మిషన్‌లో భాగంగా గ్రామాల్లో పారిశుద్ధ్య కార్యక్రమాలు చేపట్టాలన్నారు. ర్యాలీలు, సదస్సులతో ద్వారా ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. చెత్తాచెదారాలు పేరుకుపోయిన స్థలాలను గుర్తించి శుభ్రం చేసి అక్కడ మొక్కలు నాటాలన్నారు. ఉత్తమ సేవలందించిన అధికారులు, కార్మికులను గుర్తించి వచ్చే నెల 2న గాంధీ జయంతి సందర్భంగా సన్మానిస్తామని తెలిపారు.

- **పొదలకూరు:** ఈనెల 17 నుంచి అక్టోబర్ 2వ తేదీ వరకు స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమాలను నిర్వహిస్తామని ఎంపీడీఓ టి.నగేష్‌కుమారి శుక్రవారం తెలిపారు. ప్రజలకు అవగాహన కల్పించేందు 17న 5కే రన్ ఏర్పాటు చేశామన్నారు. తర్వాత వివిధ రకాల కార్యక్రమాలను గాంధీ జయంతి వరకు నిర్వహించడం జరుగుతుందని తెలియజేశారు.

దండిగుంటలో అన్నదానం



విడవలూరు : మండలంలోని దండిగుంట దళితవాడలో గణేశ్ యూత్ ఆధ్వర్యంలో వినాయకుని విగ్రహం వద్ద శుక్రవారం అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించి నైవేద్యాలు సమర్పించారు. అనంతరం భక్తులకు ప్రసాదాల వితరణ జరిగింది.

ఇరువర్గాలపై కేసుల నమోదు

తోటపల్లిగూడూరు: మండలంలోని చింతోపు గ్రామంలో గురువారం రాత్రి జరిగిన దాడుల ఘటనకు సంబంధించి ఇరువర్గాలపై కేసులు నమోదు చేసినట్లు ఎస్సై వీరేంద్రబాబు తెలిపారు. శుక్రవారం ఆయన వివరాలు వెల్లడించారు. చింతోపు గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు లేబూరు మహేష్, జక్కం తేజ, నెత్రంబాక గోపి, జక్కం పెంచలమ్మ, జక్కం నిర్మలపై పాతకక్షలతో టీడీపీ చెందిన మనుబోలు చంద్రశేఖర్, కోడి నరసయ్య, కోడి నివాస్, తురకా ఏడుకొండలు మరికొందరు దాడి చేసి తీవ్రంగా గాయపరిచారు. బాధితుల ఫిర్యాదు మేరకు పోలీసులు టీడీపీకి చెందిన మనుబోలు చంద్రశేఖర్, తురకా ఏడుకొండలు, పైనం కోటేశ్వరరావు, ఎండ్లూరు నరేంద్ర, ఉంద్రాళ్ల పృథ్వీ, కోడి నివాస్, కోడి నరసయ్య, కోడి రామమోహన్‌పై కేసు నమోదు చేశారు. కాగా వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు తమపై దాడి చేశారంటూ మనుబోలు చంద్రశేఖర్ ఇచ్చిన ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదు చేశారు. విచారణ చేపట్టినట్లు ఎస్సై తెలిపారు. అలాగే ముందస్తు చర్యల్లో భాగంగా గ్రామంలో పోలీస్ పికెట్‌ను ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు.

అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా పౌష్టికాహారం



అవగాహన కల్పిస్తున్న ఐసీడీఎస్ సిబ్బంది



కొడవలూరు మండలంలో..



సీమంతాలు చేస్తున్న దృశ్యం

తోటపల్లిగూడూరు: అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా చిన్నారులకు పౌష్టికాహారాన్ని అందజేస్తున్నట్లు ఐసీడీఎస్ పేడూరు సెక్టార్ సూపర్‌వైజర్ విజయలక్ష్మి పేర్కొన్నారు. పౌష్టికాహార మాసోత్సవాల్లో భాగంగా శుక్రవారం పేడూరు ఎస్సీ కాలనీలోని అంగన్‌వాడీ కేంద్రంలో అవగాహన కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తగినంత పౌష్టికాహారం అందినప్పుడే చిన్నారులు ఆరోగ్యకరంగా ఎదుగుతారన్నారు. అనంతరం ఐసీడీఎస్ అధికారులు పలువురు గర్భిణులకు సామూహిక సీమంతాలను నిర్వహించారు. కార్యక్రమంలో ఎంఎల్‌హెచ్‌పీ ఉమామహేశ్వరి, అంగన్‌వాడీ కార్యకర్తలు మంజుల, హరికుమారి, ఆశావర్కర్ జయమ్మ, ఆయా వెంకటరమణమ్మ తదితరులు పాల్గొన్నారు.

క్రమం తప్పకుండా తీసుకోవాలి

కొడవలూరు: గర్భిణులు, బాలింతలు క్రమం తప్పకుండా రోజూ పోషక విలువలున్న ఆహారం తీసుకోవాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ వి.పద్మావతి సూచించారు. మండలంలోని తాటాకులదిన్నెలో శుక్రవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కూరగాయలు వంటలో ఎలా వినియోగిస్తే పోషకాలు లభ్యమవుతాయి?, ఆయోడిన్ ఉప్పును ఎలా వాడితే ఆరోగ్యకరం తదితర విషయాలను వివరించారు. కార్యక్రమంలో ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎం ఎస్‌కే మస్తాన్‌వలీ, పంచాయతీ కార్యదర్శి దామోదర్, మహిళా పోలీస్ ఎస్‌కే బాదుల్లాబీ, అంగన్‌వాడీ కార్యకర్తలు జి.అరుణ, ఇ.ప్రసూన, పి.కామేశ్వరి, పోస్ట్‌మాస్టర్ ఎం.భాస్కర్ పాల్గొన్నారు.

- **ఇందుకూరుపేట:** జగదేవిపేట సెక్టార్‌కి సంబంధించి పౌష్టికాహార మాసోత్సవాలను శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏసీడీపీఓ రాజ్యలక్ష్మి మాట్లాడుతూ ప్రీస్కూల్ విద్యార్థులు ఉదయం 9 నుంచి సాయంత్రం 4 గంటల వరకు అంగన్‌వాడీ కేంద్రాల్లో ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రతి నెలా పిల్లల బరువు, ఎత్తు కొలిచి ఎదుగుదల ఎలా ఉందో రిజిస్టర్లలో నమోదు చేయాలన్నారు. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా గ్రామాల్లో అవగాహన కల్పించాలన్నారు. తొలుత గర్భిణులకు సీమంతాలు చేశారు. కార్యకమంలో సూపర్‌వైజర్ ఆర్.సుబ్బరత్నమ్మ, కార్యకర్తలు విక్టోరియ, శీనమ్మ, సునీల ఏఎన్‌ఎం శీలా పాల్గొన్నారు.

కంటి వైద్య శిబిరానికి విశేష స్పందన



కోవూరు : ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంక్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కంటి వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. కోవూరులోని ఏపీజీబీ ఆవరణలో ఏర్పాటు చేసిన శిబిరాన్ని రీజినల్ మేనేజర్ మోహన్‌రెడ్డి శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వైద్యులు పలువురు వృద్ధులకు కంటి పరీక్షలు చేసి మందులను అందజేశారు. కార్యక్రమంలో మేనేజర్ డి.విజయకుమార్, పలువురు సిబ్బంది పాల్గొన్నారు.

పీఏసీఎస్‌లకు డిజిటల్ హంగులు

ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాలు డిజిటల్ దిశగా అడుగులు వేస్తున్నాయి. ఇప్పటికే కోవూరు మండలంలోని పడుగుపాడు పీఏసీఎస్‌తోపాటు తోటపల్లిగూడూరు మండలంలోని పేడూరు పీఏసీఎస్‌లు పైలట్ ప్రాజెక్ట్‌గా కంప్యూటరీకరణను పూర్తి చేశారు. ఇవి సత్ఫలితాలు ఇవ్వడంతో ఈనెల 30వ తేదీ నాటికి జిల్లాలోని అన్ని సహకార సంఘాలను డిజిటలైజేషన్ చేసేందుకు చర్యలు తీసుకుంటున్నారు.

- పైలట్ ప్రాజెక్ట్‌గా రెండు పీఏసీఎస్‌ల్లో పూర్తి
- పారదర్శకత, నాణ్యమైన సేవలే లక్ష్యంగా అడుగులు



పీఏసీఎస్‌లో చేపడుతున్న కంప్యూటరీకరణ పనులు

నెల్లూరు(వీఆర్సీసెంటర్) : జిల్లాలో ఉన్న 78 ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాలు(పీఏసీఎస్)లను పూర్తిస్థాయిలో కంప్యూటరీకరణ చేసేందుకు అధికారులు వేగంగా చర్యలు తీసుకుంటున్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన పీఏసీఎస్‌ల కంప్యూటరీకరణ కార్యక్రమం వల్ల సహకార సంఘాల్లో పారదర్శకత, జవాబుదారీతనం, సభ్యుల పూర్తి వివరాలు, సేవలను వేగవంతంగా, సమర్థవంతంగా పొందవచ్చు.

పూర్తి వివరాల నమోదు

పీఏసీఎస్‌లను కంప్యూటరీకరణ చేయడం ద్వారా సంఘంలోని ప్రతి సభ్యుని వివరాలు కంప్యూటర్‌లలో నమోదు చేస్తారు. దీంతో వ్యాపార లావాదేవీలు, సేవల వివరాలు పూర్తిస్థాయిలో నమోదవుతాయి. రానున్న రోజుల్లో పీఏసీఎస్‌లు డీసీసీ బ్యాంకు, ఇతర బ్యాంకులతో కోర్ బ్యాంకింగ్ కార్యక్రమాలు చేపట్టే వీలు ఉంటుంది. పీఏసీఎస్‌లను కంప్యూటరీకరణ చేసే ప్రక్రియపై రాష్ట్ర ఉన్నతాధికారులు గత నెలలో జిల్లాల కలెక్టర్లు, జాయింట్ కలెక్టర్లు, డీసీఓలతో ఆన్‌లైన్ ద్వారా సమీక్షా సమావేశం నిర్వహించి దిశా నిర్దేశం చేశారు.

నిధుల దుర్వినియోగానికి అడ్డుకట్ట

జిల్లాలో మొత్తం 78 పీఏసీఎస్‌లు ఉండగా, వీటిలో 3,37,618 మంది సభ్యులుగా ఉన్నారు. కంప్యూటరీకరణ వల్ల మొత్తం సభ్యుల వివరాలు పూర్తిస్థాయిలో డిజిటల్‌గా మారుతుంది. సహకార చట్టాన్ని అనుసరించి సొంత భూమి కలిగిన వారు, కౌలుభూమిని సాగు చేస్తున్న వారు సభ్యులుగా అర్హత కలిగి ఉంటారు. వారి భూముల వివరాలు కూడా నమోదవుతాయి. దీనివల్ల నిధుల దుర్వినియోగం అరికట్టడంతో పాటు, పారదర్శకత పెరుగుతుంది. అంతేకాక కోర్‌బ్యాంకింగ్‌కు పీఏసీఎస్‌లు అనుబంధంగా ఉండి ప్రతి పీఏసీఎస్ పంచాయతీ, మండల కేంద్రాల్లో బ్యాంకు కార్యకలాపాలు కొనసాగిస్తాయి. సంఘ సభ్యులకు అన్నిరకాల ఆన్‌లైన్ సేవలు అందుతాయి.

నెలాఖరుకు..

జిల్లాలో పైలట్ ప్రాజెక్టు కింద పడుగుపాడు, పేడూరు పీఏసీఎస్‌లు గతనెల ఆగస్టు 15లోపు కంప్యూటరీకరణ పనులు పూర్తయ్యాయి. సెప్టెంబర్ 30వ తేదీలోపు అన్ని పీఏసీఎస్‌లు కంప్యూటరీకరణ చేసేందుకు సన్నాహాలు చేస్తున్నారు. ఈ విషయమై కలెక్టర్, జాయింట్ కలెక్టర్ ప్రతిరోజూ పీఏసీఎస్‌ల కంప్యూటరీకరణ పనులు వేగవంతం చేయాలని సమీక్షలు నిర్వహిస్తున్నారు.

అలసత్వం వహిస్తే చర్యలు తప్పవు



సెప్టెంబర్ 30వ తేదీ నాటికి జిల్లాలోని అన్ని పీఏసీఎస్‌లు పూర్తి కంప్యూటరీకరణ చేసేందుకు చర్యలు తీసుకుంటున్నాం. అందుకు పీఏసీఎస్‌ల సీఈఓలు, డీసీసీ బ్యాంకు సూపర్‌వైజర్లు, మేనేజర్లు, సహకారశాఖ సిబ్బంది సమన్వయంతో పనిచేసి నిర్ణీత గడువులోపు పూర్తి చేస్తాం. ఈ విషయంలో ఎవరైనా అలసత్వం వహిస్తే క్రమశిక్షణా చర్యలు తప్పవు.

– గుర్రప్ప, జిల్లా సహకార శాఖాధికారి (డీసీఓ)

ఆలయానికి గ్రిల్స్ ఏర్పాటు



మనుబోలు: మనుబోలు గ్రామదేవతలు మనుబోలమ్మ, నాగార్పమ్మ ఆలయాలకు ఇనుప గ్రిల్స్‌ను దాతలు వితరణ చేశారు. చాట్ల వెంకటసుబ్బయ్య, సామ్రాజ్యమ్మల జ్ఞాపకార్థం వారి కుమారులు శేషగిరిరావు, హరగోపాల్, సుబ్రహ్మణ్యం వీటిని అందజేశారు. ఈ సందర్భంగా శుక్రవారం అర్చకుడు ఫణీంద్రశర్మ ప్రత్యేక పూజలు చేసి దాతలకు ధన్యవాదాలు తెలిపారు.

17 నుంచి స్కూల్ కాంప్లెక్స్ సమావేశాలు



మాట్లాడుతున్న ఎంఈఓ

మనుబోలు: ఈనెల 17 నుంచి స్కూల్ కాంప్లెక్స్ సమావేశాలు నిర్వహిస్తామని ఎంఈఓ వేణుగోపాల్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం తన కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ మండ కేంద్రంలోని బాలికల ఉన్నత పాఠశాలలో తెలుగు పండిట్లకు, బాలికల పాఠశాలలో సోషల్ స్కూల్ అసిస్టెంట్లకు శిక్షణ ఇస్తామన్నారు.